# పర్యవసానమేమిటి?..

రచన:
'రమ'

'డ్రీ రింగ్...'

—వినిపించిన దిక్కు కళ్ళెత్తి చూశాను!

ముఖం చిట్లిస్తూ అన్న నిశీరాణి ప్రక్కనుండి రాసుకుంటు వెళ్తున్న రాంబాబు, ఆమె అన్నమాటలకి ఆహ్లాదంగా నవ్వుకుంటున్నాడు. అందమైన వాళ్ళ తిట్లు మహా ప్రసాదంగా స్వీకరిస్తారు మా హీరోలు చాలామంది!

మాది ఆర్ట్స్ కాలేజీ కదూ! ఆ సంవత్సరమే బి. ఎ. లో ప్రవేశించింది నిశి.

నిశీరాణి—

పాలమీగడలో పసుపు కలిపిన ముద్దతో మలిచిన అందమైన అజంతా శిల్పంలా, వంకరలు దీరిన అంగ సౌష్టవం; నల్లని తుమ్మెదలను బోలిన నిడివైన వేణీ భరం.! కమలము రేకుల వైశాల్యంనకు తీసిపోని వెడల్పాటి నేత్ర ద్వయానికి సన్నగా తీర్చి దిద్దిన కాటుక రేఖ మరీ అందాన్నిచ్చింది. విల్లువలె సుతారంగా వంగిన నల్లని కనుబొమల మధ్య-విశాల లలాటఫలకంపై చిరుముంగురు వాలి, నాట్యం చేస్తుంటె-అరుణ భానునిలా శోభిస్తున్న తిలకం. సంపంగి ముక్కు, కెందామర పుష్పంలో దాచిన మల్లెల దండవలె-ఎర్రని పెదాలమధ్య తెల్లని పలువరుస, సున్నని గడ్డంతో సవాల్ చేస్తున్న పుట్టుమచ్చ, నీళ్లు మింగితే కనిపించె-కంఠమాలతో, చక్కని సన్నని గొలుసు, ఉన్నతమైన స్తనద్వయంతో నపుంసకున్ని సైతం మేల్కొల్పె హొయలులో హంస గమనాన్ని మరిపించే అడుగులతో నడుస్తుంటె, వచ్చే నిశీరాణిని చూసి అందరూ మత్తుజల్లినట్లు ఉండిపోతారు!

ఇది కోరికలూరె వయసేకాని, దానికి దగిన బాధ్యతలు- బరువులు తెల్సుకోవల్సింది కళాశాల జీవితంలోనే! కాని, విద్యార్జనకోసం వచ్చి, దానికి బదులు విద్యార్థులు-శృంగార రసాన్వేషణలో సాగుతూ తమ కర్తవ్యాన్ని మర్చిపోవడం శోచనీయం-

అందమైనదాన్ని వాంఛించంది-ఎవరు? - అలాగే అందరూ 'కాలేజీ బ్యూటీ!' వంటి బిరుదందుకున్న నిశీరాణి సహచర్యం కోసం తహతహ లాడుతున్నారు. అలాంటివాళ్ళలో రాంబాంబు-ఒకడు! ఆమెను రాచుకుంటు వెళ్ళగానే దూరంలో నిల్చున్న సోదరమూక అభినందించారు. అది చూసిన నిశి పళ్ళు పటపట లాడిస్తు క్లాసురూం లోకి వెళ్ళింది!

అందమైన నిశికి, అహం అతిశయం కాస్త ఎక్కువే! ఎవ్వరితోను చక్కగా మాట్లాడదు. చివరకు లేడీ స్టుడెంట్స్‌తో కూడ అంతే విద్యార్థులకు ఆమె కావలన్న ఆపేక్షంతో భయం కూడ జాస్తే! ఎడారిలో ఒయాసిస్సులా ఫైనల్ ఇయర్ స్టుడెంట్, చక్రవర్తి అంటేమాత్రం అభిమానం చూపుతుంది. ఆ అభిమానం ఎలాటిదో తెలియదు.

అయినా ఆపాటికే వారిపైన ఎన్నోవార్తలు వినిపించాయి. వాటిని గురించి కేర్ చేయదు చక్రవర్తి అంటె, మరి వాళ్ళ ఉద్దేశం ఏమిటో? తెలియదు. ప్రెసిడెంటుగా చక్రవర్తి నామినేట్ చేసింది, ఆమె అతని తరఫున ప్రచారం చేసింది కూడా. అప్పుడు మాత్రం తియ్యగా చక్కగా అందర్ని పలుకరించేది. అదే మహాభాగ్య మనుకొని అందరు చక్రవర్తికే ఓటు వేశారు. ఆపై మళ్లీ మామూలే!-అబ్బ ఎంతటక్కరిది అనుకున్నారంతా. అదే కోపంతో రామం ఢీ కొన్నాడేమో? పాపం!

దూరంగా నిల్చున్న మూకలో—

'నిశీరాణి మనపై పళ్ళుకొరుకుతుంది. ప్రిన్సిపాల్ గారికి ఏమైనా నివేదిస్తుందేమో?' అన్నాడొకతను.

'ఏమన్నామని మనపైన పిర్యాదుచేస్తుందిరా!' మరొకడు-అందుకున్నాడు.

'హేళన చేస్తున్నామని!'

'రామం తన కుసుమ కోమల శరీరాన్ని రాసుకుంటు వెళ్ళాడంటు చక్రవర్తి ఊరుకుంటాడేంటి?'

ఇలా చర్చ జరుగుతుంటె రామం మాత్రం మౌనముద్ర వహించాడు.

'ఒరే, రామం! ఆ మల్లెల వాసనింకా మత్తెక్కిస్తుందా?... సుషుప్తావస్త నీదటం లేదేమిటిరా,' అంటు కొంటెగా కదిపాడొకడు. కాని అంతలోనె బెల్లైంది. ఎవరి క్లాసుల్లోకి వాళ్లు వెళ్లిపోయారు. అనుకున్నట్టుగా అల్లరేమీ జరుగలేదు.

కాలేజీ అయిపోగానే నిశి వెన్నంటి పోయాడు రాంబాబు. ఎలా పల్కరించడమా? అంటు యోచిస్తున్న రాంబాబుకు నిశి ఎదుటి హోటల్లోకి పోవడం ధైర్యాన్నిచ్చింది.

'ఫ్యామిలీరూం' అని వ్రాసి పెట్టిన గదిలోకి ఆమెను వెన్నంటే వెళ్ళాడు. కుర్చీలో కూర్చుని 'టీ' కి ఆర్డరిచ్చిన ఆమె మరో కుర్చీలో రాంబాబును చూసి ఉలిక్కిపడి, బుసలు కొడుతున్న నాగుపాములా చర్రునలేచి వెళ్ళిపోబోయింది. మరోమారు నిప్పులు కురిపిస్తున్నట్లు చూస్తు

బయటికడుగేయ బోతుంటే, 'ఒక్క క్షణం! మాట్లాడండి నిశీరాణీ' అన్నాడు రాంబాబు గొంతు పెగుల్చుకొని అర్థిస్తున్న వాడిలా.

ఏమనుకుందో ఏమో వెనక్కి వచ్చి సీట్లో కూర్చొని– 'ప్రొద్దున దానికి ఏమైనా మిగిలిపోయిందా?' అంది తీక్షణంగా

'మీరు పొరపడుతున్నారు'

'పొరపాటో గ్రహపాటో, ఇంతకీ మీరుఅడగదల్చుకున్నది ఏమిటి?'

'ప్రొద్దున మీకు కావాలని తగలలేదు,'

'అందుకు యిప్పుడు సంజాయిషీ చెప్పుకోదల్చారా?'

'అబ్బే అలాంటిదేమీ కాదు'

'మరేంటి?'

'నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను.'

'ఇప్పుడంటె అన్నారు గాని మరోమారు అంటే... ఎర్రగడ్డ హాస్పిటల్‌కు పంపించ వల్సిన అవసరం వస్తుంది...'

'నన్నో పిచ్చివానిగా లెక్కిస్తున్నారా? నిశీరాణి! అందం ఐశ్వర్యం, అన్నీ వున్నాయి మరి! ప్రేమకు పాత్రుణ్ని కాలేకపోతున్నందుకు కారణం...?'

'చెప్తుంటె మీకు కాదా?... నే నెలాటి దాన్నో తెల్సిందే మాట్లాడుతున్నారా?... హు॥! ప్రేమ! అది ఊరి బజారులో దొరికే వస్తువుకాదు రాంబాబూ ఎదురైన వాడిని ప్రేమించడానికి'

'ఐశ్వర్యవంతురాలవని తెలుసు, కాని ప్రేమకలీతురాలివి కాదుగా! నేను అందులోనూ, హోదాలోనూ మీకే మాత్రం తీసిపోనే!...'

'హు! అందం! ఐశ్వర్యం తప్ప మరేం తెలీదు. దయచేసి ఒకమారు—మెంటల్ హాస్పిటల్‌కు వెళ్ళిరావడమే మంచిది.'

'నన్నెందుకు ధిక్కరిస్తున్నారో తెలుసు. అయినా... చక్రవర్తి నాకుండెంత...' అనంగానే...

'యూ, రాస్కెల్! కల్చర్ లెస్ బ్రూట్' అంటూ 'టీ' తీసుకోకుండానే డబ్బు కౌంటర్‌కు చెల్లించి వెళ్ళిపోయింది. కాని ఆమె పుస్తకాల్లోనుండి రాలిపడ్డ కాగితాన్ని రాంబాబు తీసుకోవడం ఆమె గమనించలేదు.

*        *        *        *

తెల్లవారి కాలేజీ గోడలపైనా, బోర్డుపైనా—

రాణి × చక్రవర్తి=? అని ఉండడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

'చక్రవర్తి × నిశీరాణి? '

ఆ విషయం విన్న నిశి బాధపడి ప్రిన్సిపాల్ గారితో చెప్పింది. అందరి గుండెలు గుబగుబలాడాయి–ఆయన ఆవరణలో అందర్నీ సమావేశ పర్చి ఆసీను కమ్మనగానే–

'మీ తల్లి తండ్రులు ఎంతో శ్రమకోర్చి మీపై మమతతో అభివృద్ధికోసం ఎక్కడెక్కడి నుండో బుద్ధిగా చదివి సంస్కారవంతులు కావాలనిపంపించారు. ఉన్నత ఆశయాలు నెరవేర్చుకొని ఆదర్శమానవునిగా తయారౌదామని ఒక్కరూ అనుకోరేం?... రేపటి పౌరులు, భావీ భారతనిర్మాతలు, ఈ విధంగా దినదినం జ్ఞానహీనులు కావటం ఎంత శోచనీయం!...మీరు విద్యాలయానికు వచ్చేది విద్యార్జన కోసంగాని, ప్రేమపాఠాలు వల్లించడం కోసం కాదు...మీతోపాటు చదువుకుంటున్న విద్యార్థినులను అవహేళనచేయడం కోసం కాదు!! సంఘంలో జీర్ణించుకొన్న బూజును దులుపుకొని శుభ్రపర్చాల్సిన మీరు మసిరాయ ప్రయత్నించడం న్యాయం కాదు. అమృత కలశంలో ఒక విషపు బిందువు చిలుకితే–అమృతం హాలాహలంగా మారిపోతుంది, అలాగే అసహ్యమైన భావాలతో అక్రమ చర్యలతో విద్యాసంస్థలను కల్లోలితం చేసే చీడపురుగులుంటే ఎప్పటికీ ప్రమాదమే!...అలాంటి వారిని తొలగించటం నా తక్షణ కర్తవ్యం!' అంటు గంభీరంగా మాట్లాడి, ఒకసారి అందరిని కలియజూసి–

'నిశీరాణి × చక్రవర్తి=?' అంటూ వ్రాసిందెవరు?... అందరూ తలలు వంచుకున్నారేం? ఏ ఒక్కరూ జవాబు చెప్పరేం? ఏం అప్పుడు వ్రాయంగా జంకు లేదుగాని యిప్పుడెందుకా బిడియం? అలా వ్రాసిన ధైర్యవంతులు ఎవరు? కాస్త బయటకు వస్తే సంతోషిస్తా!'

అంతా నిశబ్దం.

'ఆల్ రైట్! తెలియక పోదు!'–మిస్టర్ రాంబాబూ!' అనగానే–

అన్ని జతల కళ్లు ఒకసారి రాంబాబు వేపు తిరిగాయి.

నిల్చున్నాడు రాంబాబు.

'చక్రవర్తి–రాణిపై అక్రమ సంబంధ అంటగట్టింది... ప్రచారం చేస్తున్నది నువ్వేనా?' అడిగాడు ప్రిన్సిపాల్ సీరియస్‌గా.

'అబ్బె నేనా? అనవసరంగా అభియోగాన్ని నాపై మోపుతున్నారు సర్'...ధైర్యంగానె జవాబిచ్చాడు.

ఇది కాలేజీగాని డ్రామాహాలు కాదన్న విషయం తెల్సునా?'

'తెలుసు!' 'నువ్వు వచ్చింది.' చదువుకోవడం కోసమన్న విషయం గుర్తుందా?'

'ఔనన్నట్లు తల ఊపాడు'

'ఒంటరిగా స్త్రీతో' 'ప్రేమ' పాఠాలు వల్లించడం కూడా ఒక సబ్జెక్టేనా?' ప్రశ్న గూడంగా వున్నా అందరూ ఒక్కసారి నవ్వుకున్నారు లోలోనె.

'సార్! వుత్తరాలు వ్రాయగా లేనిది అడగ్గానే నేరమయి పోయిందా?...ఇదిగో చూడండి!' అంటు ఒక ఉత్తరం తీసి ప్రిన్సిపాల్ చేతికిచ్చాడు ధైర్యంగా.

ఆయన సాంతం చదివి బొమ్మలు ముడివేసి_

'ఉన్న విషయాన్ని దాచిపెట్టడానికి ఎందు ప్రయత్నించావు నిశిరాణీ!' అన్నాడు కాస్త కఠినంగానె ప్రిన్సిపాల్.

ఉత్తరంలో ఏముంది? ఆమె రాయడానికి ప్రయత్నించిందేమిటి? అర్థంగాక అందరూ అటువేపు చూడసాగారు.

'ఈ వుత్తరం ఏమిటి?'

నిశి అందుకుంది_

'రసిక చక్రవర్తీ!

మానస చోరా!...

ఈరోజు నిండుపౌర్ణమి. ఆరుబయట పడుకుంటె శశి వన్నె హేళన చేస్తున్నాడు. పడక అంపశయ్యలా బాధపడ్తోంది. మంద మారుతం మంట రేపుతోంది. కన్నుల ముందు కదలాడే నీ మనోజ్ఞ రూపసౌందర్యం నన్ను కితకితలు పెడ్తోంది. ఎప్పుడు నీ ఒడిలోనె ఉండిపోవాలనిపిస్తోంది. కాని యీ పాడులోకం నన్నుండ నివ్వదు. నువ్వందించిన ఆనందాన్ని మననం చేసుకుంటు రాత్రంతా గడపనా? అబ్బా! నన్ను కరుణించవా రాజా! పరిష్వంగం కోసం వేసారే యీ రాణిని చేర్చుకోవూ...!

సంపూర్ణంగా నిన్ను చేరే రోజు ఎప్పుడు వస్తుందో? మరి!

అంతవరకు నిరీక్షించడమేనా ప్రభూ!

—నీ
'రాణి.'

పంక్తులపై కళ్లు తిప్పుతుంటె అంతవరకు ఆందోళన కనబర్చిన నిశి చిన్నగా నవ్వుకుని, దాన్ని నాకిచ్చింది. చదివాను, నాకు అర్థమయింది. అప్పుడప్పుడు కథలు వ్రాస్తుంటుంది నిశి. అది ఒక కథలోని లెటరు! దాన్నే నిశి చక్రవర్తికి వ్రాసిన ఉత్తరంగా భావించాడు రాంబాబు. ప్రిన్సిపాల్ గారు కూడా భ్రమించారు. ఆ విషయాన్నే చెప్పాను నేను. అంతా అబ్బుర పడ్డారు.

'కథలు వ్రాసేదాని విలా అజాగ్రత్తగా ప్రవర్తిస్తే ఎంత పొరపాటుకు దారితీసిందో చూశావా?...ఇకపై మాత్రం_కాస్త జాగ్రత్తగా, శ్రద్ధగా మసలుకో నిశీ!' అన్నారు ప్రిన్సిపాల్ గారు, మరేమనలేక.

తలవంచుకుంది__నిశి!

'ఇంతకీ గోడపై వ్రాసిందెవరో తేలలేదు' అని అడిగి 'రాంబాబూ! తొందరపడి నువ్విలాటి నిర్ణయాలకు రాకు!...ఇకపైన నీవు మాత్రం ఆడవాళ్ళ పట్ల జాగ్రత్తగా ప్రవర్తించు.' అని హెచ్చరించి_అందర్ని వెడలి పొమ్మన్నాడు.

మా ప్రక్కనుండి వెళ్తున్న చక్రవర్తి కాస్త దగ్గరగా వచ్చి నావల్ల మీరు బాధపడాల్సి వస్తుందనుకో లేదు. ఇలాటివి పెల్లుబుకుతాయని నే నూహించనూ లేదు.' అన్నాడు కంఠంలో బాధ ధ్వనించుతూంటె.

'నన్ను క్షమించండి నిశిరాణీ! ఆ విషయాన్ని చూసి చాల బాధపడుతున్నాను'

దానికి మీరు బాధ్యులు ఎలా అవుతారు. చక్రవర్తీ! వాళ్ళెవరో ప్రేలుతుంటె మీరెందుకు వ్యథ చెందడం? అయినా స్నేహంలో క్షమార్పణ లేమిటండీ? అంది మృదువుగా.

'మీ అభిమానానికి సర్వదా కృతజ్ఞుడిని' అన్నాడు చక్రవర్తి.

కృతజ్ఞత తెలియపర్చుకునె దినం రాకపోదు! అప్పుడు తీర్చుకుందురుగాని!'...

అంతవరకు ఎటో చూస్తు వింటున్న నేను ఉలిక్కిపడ్డాను. నిశి మాటలు విని...కారణం?...చక్రవర్తిని ప్రేమిస్తున్నదా? అంటె, కస్సుబుస్సుమంటు చిందులు తొక్కె నిశి, చక్రవర్తిని ఏ రూపంలో అభిమానిస్తుంది?_ మరి ఈ మాటలకి అర్థం!

రాజఠీవి దర్పంతో అడుగులేస్తు పోతున్న చక్రవర్తిని చూసి నామనసే చలించింది. ఆ క్షణం చక్రవర్తి సౌందర్యానికి సమ్మోహితురాలు నయ్యానంటె తప్పు లేదు!

అందుకే మళ్ళీ మళ్ళీ ప్రశ్నించుకున్నాను_అదే! నిశి చక్రవర్తిని ప్రేమిస్తుందా!?

లేకపోతే! ఆమె అభిమానించడంలో గల అంతరార్థం ఏమిటి?_ఈ కథకు పర్యవసాన మేమిటో? మరి!

---

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు, రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులము కాదు.

—సంపాదకుడు.